

దోమ: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



యాలాల: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



దోమ: ప్రచారంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి

మూడోసారి అధికారం ఖాయం

- ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం
- సంక్షేమ పథకాలే పార్టీకి అండ
- ప్రభుత్వ పనితీరుతో పార్టీలో చేరికలు
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

యాలాల: రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి, ముఖ్యమంత్రిగా కేసీఆర్ కొనసాగుతారని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి అగ్గనూరుకు చెందిన పలువురు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో అధికార పార్టీలో చేరగా.. వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తాండూరు అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ లక్ష్యంగా బీఆర్‌ఎస్ పనిచేస్తుందని, సంక్షేమ పథకాలే పార్టీకి అండ అని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నుంచి భారీగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ భీమప్ప, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, గ్రామ యువజన విభాగం నాయకుడు మహేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మీ ఆశీర్వాదమే పైలట్ బలం

ప్రజా ఆశీర్వాదమే పైలట్ రోహిత్‌రెడ్డి బలమని వికారాబాద్ జెడ్పీటీసీ, రోహిత్‌రెడ్డి తల్లి ప్రమోదిని అన్నారు. యాలాల మండలం ముద్దాయిపేట, సంగాయగుట్ట తండాలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఇందులో ఆమె మాట్లాడారు. ప్రతి పంచాయతీకి రూ.50 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. అలాంటి వ్యక్తికి తిరిగి పట్టం కట్టాలని ప్రమోదిని కోరారు. కార్యక్రమంలో తాండూరు ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, సర్పంచ్ కృష్ణయ్య గౌడ్, మాజీ సర్పంచ్‌లు బిచ్చన్నగౌడ్, వెంకటయ్య, రైతు కమిటీ అధ్యక్షుడు గోపాల్, మైనార్టీ నాయకులు ఆసిఫ్ హుస్సేన్, జహీరొద్దీన్, ఉపసర్పంచ్ కిషన్ నాయక్, సంగమేశ్వర్, మహ్మద్ ఖాన్, రవికుమార్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

పార్టీలో పలువురి చేరిక

తాండూరు రూరల్: మండల పరిధి చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అగ్గనూర్ అశోక్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరారు. శుక్రవారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఇందులో భాకర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్ ఉన్నారు.



యాలాల: ముద్దాయిపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తల్లి ప్రమోదిని

యువతకు అండగా..

యువతకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి కోత్లాపూర్ గ్రామానికి చెందిన సురేష్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతను ఏ పార్టీ పట్టించుకోలేదని, తాను అధికారంలోకి వచ్చిన తర్వాతే వారికి గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

దోమ: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తాయని ఎమ్మెల్యే సతీమణి ప్రతిమారెడ్డి అన్నారు. దోమ మండలం రాకొండ, గుండాల గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు లక్ష్మి, మంజుల, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మండల పరిధి బుద్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇందులో జెడ్పీటీసీ నాగిరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు

కాంగ్రెస్ పార్టీ నాయకుల మాయమాటలను ప్రజలు నమ్మొద్దని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. దోమ మండలం బొంపల్లి గ్రామంలో పలు పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఎంపీటీసీ రాములు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ఆయనతోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. ప్రజలు కేసీఆర్ పాలన పట్ల పూర్తి విశ్వసంతో ఉన్నారని, అదే నమ్మకంతో బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఇందులో మైనార్టీ సెల్ గ్రామ అధ్యక్షుడు తాహెర్‌పాష, పార్టీ నాయకులు షఫీ, భీమయ్య, శ్రీనివాస్, మల్లేపల్లి శ్రీనివాస్, మల్లేశ్, యాదయ్య ఉన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వాలి

అనంతగిరి: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఆనంద్‌ను ఆదరించాలని ఆయన సతీమణి సబిత కోరారు. వికారాబాద్ పట్టణం రాజీవ్ గృహకల్పలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తన భర్తను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఇందులో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకుడు విజయ్ కుమార్, కౌన్సిలర్లు లంక పుష్పలత రెడ్డి, కృష్ణారెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు గిరీష్ కొఠారి, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి సబిత తదితరులు

అవ్వా పింఛన్ వస్తోందా?

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమాలు అందుతున్నాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్ అన్నారు. పరిగి మండలం సయ్యాద్ మల్కాపూర్ గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా ఆయన ఓ అవ్వతో ముచ్చటించారు. అవ్వా పింఛన్ వస్తుందా? ఎంత వస్తుంది? ఎవరికి ఓటేస్తావు అని కుశల ప్రశ్నలు అడిగారు.



వృద్ధురాలితో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్

బాబు నిర్ణయంతో.. బీసీలకు అన్యాయం

కుల్కచర్ల: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయం వలనే తెలంగాణలోని బీసీలకు పరోక్షంగా అన్యాయం జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, సీనియర్ న్యాయవాది బాలముకుందం ఆరోపించారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యకర్తలు, ముదిరాజ్, బీసీ సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం మాట్లాడారు. తెలుగుదేశం ఆధ్వర్యంలో బీసీలకు న్యాయం జరిగేందుకు కృషి చేద్దామని కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో పనిచేశామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కువ మంది బీసీలకు సీట్లు ఇవ్వడం ద్వారా రాజ్యాధికారాన్ని సాధించేందుకు ముందుకు సాగుతున్న క్రమంలో చంద్రబాబు తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేయవద్దని పేర్కొనడం బాధకరమన్నారు. మెజార్టీ తమ్ముళ్ల అభిప్రాయం మేరకు బీసీలకు న్యాయం జరిగే పార్టీలో చేరతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వెంకటయ్య, లక్ష్మయ్య, మైపాల్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడి మృతి

బొంరాస్‌పేట: కట్టుకున్న భార్య, ఇద్దరు కొడుకులు తన కళ్లముందే చనిపోయారు. కూతురికి పెళ్లిచేసి పంపాడు. అనంతరం సొంతూరులో అనాథగా కాలం గడిపిన ఓ వృద్ధుడు చెరువులో పడి శవమయ్యాడు. ఎస్‌ఐ శంకర్, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుద్యాల మండలం హంసాన్‌పల్లికి చెందిన జెల్ల పెద్ద నర్సింహులు అలియాస్ పులి వీరన్న(61)కు ఇద్దరు కొడుకులు పెంటప్ప, హన్మంతు, కూతురు సాయిలమ్మ ఉండగా.. పెద్ద కొడుకు పెంటప్ప ఈర్లపల్లికి ఇల్లరికం వెళ్లి అక్కడే చనిపోయాడు. చిన్న కొడుకు హన్మంతు ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మృతి చెందగా.. ప్రభుత్వం ఇస్తున్న పింఛనుతో కాలం గడుపుతూ ఒంటరిగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా.. శుక్రవారం ఉదయం నాన్‌చెరువుతండా వాసులు కొందరు గ్రామ శివారులోని నాన్‌చెరువులో వీరన్న మృత దేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పరిగి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మానవీయ కోణంలో గ్రామస్తులే వృద్ధుడి అంత్యక్రియలు జరిపారు.

ఆర్థిక సహాయం

మర్పల్లి: మండల పరిధి పంచలింగాల, నర్సాపూర్ పెద్ద తండాలో ఇరువురు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్ట్ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి బాధిత కుటుంబాలకు ఒక్కక్కరికి రూ.5వేల చొప్పున రూ.10 వేలు అందజేశారు. ఇందులో మర్పల్లి సహకార సంఘం చైర్మన్, ట్రస్ట్ సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి, పంచలింగాల సర్పంచ్ సురేందర్ రెడ్డి, నర్సాపూర్ పెద్దతండా సర్పంచ్ ధరమ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పశు సంపదను కాపాడుకోవాలి

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్

పెద్దేముల్: మూగ జీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించి, పశు సంపదను కాపాడుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. శుక్రవారం పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామంలో గర్భకోశ వ్యాధి నిర్ధారణ, చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 25 ఆవులు, బర్రెలకు వైద్య పరీక్షలు చేశారు. 315 జీవాలకు టీకాలు వేశారు. సీజన్ వ్యాధుల పట్ల కాపరులు అప్రమంత్తంగా ఉండాలని డాక్టర్ సూచించారు. ఈ నెల 20 వరకు మండల పరిధి గ్రామాల్లో ఉచితంగా గొర్రెలకు, మేకలకు పారుడు రోగం నివారణ టీకాలు వేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్దేముల్ పశువైద్యాధికారి డాక్టర్ వెంకటపతి రాజు, డాక్టర్ ఉష, చంద్రశేఖర్, సిబ్బంది శేఖర్, సిద్దిక్, ఇమ్రాన్, శ్రీనివాస్ ఉన్నారు.

కలెక్టరేట్‌ను సందర్శించిన ఎన్నికల పరిశీలకులు



రికార్డులను పరిశీలిస్తున్న పరిశీలకులు

వికారాబాద్ అర్బన్: ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వచ్చిన మునిష్ రజినీ శుక్రవారం కలెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బరిలో ఉన్న అభ్యర్థులకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియామవళిని అనుసరించి చేస్తున్న ఖర్చులపై ఎంసీసీ వ్యయ విభాగంలో నిర్వహిస్తున్న రికార్డులను కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. వార్తాపత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై ఆరా తీశారు. ఎంసీఎంసీ ద్వారా ప్రచారం నిమిత్తం ఇచ్చే అనుమతులను, ప్రకటన తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణన్ తదితరులు ఉన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

- తహసీల్దార్ పురుషోత్తం

దోమ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులుతో కలిసి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ షెడ్యూల్‌ను విడుదల చేశారు. శుక్రవారం నుంచి అభ్యర్థుల నామినేషన్లను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ నెల 10 వరకు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నవంబర్ 13న నామినేషన్లకు స్క్రూటీ్నీ జరుగుతుందని, విత్‌డ్రాలు నవంబర్ 15న ఉంటాయని వెల్లడించారు. నవంబర్ 30న ఎన్నికలు జరగగా, డిసెంబర్ 3న లెక్కింపు ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా.. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిందని, దానిని అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటువేసి, మంచి నాయకున్ని ఎన్నుకోవాలని కోరారు.

తాండూరు టికెట్ జనసేనకు ఇవ్వొద్దు



రమేష్‌కుమార్

తాండూరు టౌన్: తాండూరు టికెట్‌ను జనసేన పార్టీకి కేటాయించవద్దని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన తాండూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఇక్కడ బీజేపీ బలంగా ఉందని, ఈ సారి ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. జనసేనతో పొత్తు కారణంగా తాండూరు స్థానాన్ని జనసేనకు కేటాయించే ఆలోచన విరమించుకోవాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు చెప్పారు.

ఎన్నికల ప్రచారంలో విద్యుత్ ఉద్యోగి!

దోమ: ఓ ట్రాన్స్‌కో ఉద్యోగి అధికార పార్టీ బీఆర్‌ఎస్‌కు ప్రచారం చేయడంతో కాంగ్రెస్ నాయకులు మండి పడ్డారు. ఓ ఉద్యోగిగా ఉండి ఇలా చేయడం మంచిది కాదన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుండాల గ్రామానికి చెందిన బోయిని రమేష్, కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. రమేశ్ గులాబీ కండువా కప్పుకొని ప్రచారం చేస్తూ కనిపించాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. వెంటనే సదరు ఉద్యోగిపై సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీతోనే అభివృద్ధి

కుల్కచర్ల: బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమవుతుందని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్యలు అన్నారు. శుక్రవారం పలువురు బీజేపీలో చేరారు. అనంతరం వారు మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు.

నేడు బాహ్య ప్రపంచంలోకి జగద్గురువు

11 రోజులుగా శివాచార్య స్వామి శివయాగ సమాధి!

బషీరాబాద్: లోక కల్యాణం కోసం ఓ జగద్గురువు అత్యంత కఠినమైన శివయాగ సమాధి అయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన బషీరాబాద్ మండలం మంతట్టి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్ర బూధీశ్వర సంస్థాన మఠం అంతూరు, బెంతూరు పీఠాధిపతి డాక్టర్ రాచోటి శివాచార్య స్వామి ఆధ్యాత్మిక గురువు.. మంతట్టిలోని శ్రీకృషిధర్మ ఈశ్వర పీఠం ఆధ్వర్యంలో గత నెల 25న మల్లన్న ఆలయంలో శివయాగ సమాధికి కూర్చున్నారు. ఎలాంటి అన్న పాణీయాలు తీసుకోకుండా, నిద్రలేకుండా, మల మూత్రాలు విసర్జించకుండా ఆలయంలోకి ఎలాంటి గాలి, వెలుతురు రాకుండా, చీమకూడా దూరనంతగా ఆలయ ద్వారాన్ని ఇటుక, సిమెంట్‌తో మూసేశారు. ధాన్యంలో ఉండి గ్రామం సుభిక్షంగా ఉండాలని, లోక కల్యాణం జరగాలని మౌన అనుష్టానానికి పూనుకున్నట్లు భక్తులు తెలిపారు. 11 రోజుల ధ్యానం పూర్తి చేసుకొని శనివారం ఉదయం 8.30 గంటలకు స్వామిజీ బాహ్య ప్రపంచంలోకి వస్తారని భక్తులు పేర్కొన్నారు. అనంతరం తపశక్తితో శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రవచనాలు చెప్పనున్నారని పేర్కొన్నారు. ఈ వింత చూడటానికి పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు తరలి వస్తున్నారు.



ఆలయ ఆవరణలో భక్తుల భజనలు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం స్వామి వారికి అభిషేకం, అంకురార్పణం, హారతి తీర్థ ప్రసాదాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని, ఆదివారం మహాపూర్ణాహుతి, ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరగనున్నట్లు పేర్కొన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఆలయ ముఖద్వారం ఏర్పాటుకు పూజలు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావాలను పెంపొందించుకోవాలని సర్పంచ్ సౌమ్యారెడ్డి అన్నారు. శుక్రవారం అంగడిబజార్ కాలనీలో వీరాంజనేయ స్వామి ఆలయ ముఖద్వారం ఏర్పాటుకు దాత కుమ్మరి స్వామి ముందుకు వచ్చారు. దీంతో ఆచార సంప్రదాయాల ప్రకారం పూజకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సహకరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, బాల్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి,రాంచంద్రయ్య, కృష్ణయ్య, వెంకటేశ్, రాములు, బాలు, వీరేశలింగం, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నిర్వాహకులు

బంగారు ఆభరణాలు స్వాధీనం



ఆభరణాలు చూపిస్తున్న పోలీసులు

తాండూరు టౌన్: ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు 21 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణానికి చెందిన ఓ మహిళ అమెరికా నుంచి శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి కారులో పట్టణానికి వస్తుండగా శివారు ఖాంజాపూర్ గేటు వద్ద కారును ఆపి పోలీసులు సోదా చేయగా.. ఆమె వద్ద 21 తులాల బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. అయితే పరిమితికి మించి ఆభరణాలను తీసుకెళ్తున్నందున వాటిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపారు. అనంతరం స్క్రీనింగ్ కమిటీ సభ్యులకు సొత్తును అందజేశారు. ఈ నగలకు సంబంధించిన రసీదును చూపించి వాటిని తీసుకెళ్లవచ్చని సదరు మహిళకు సీఐ సూచించారు.

ప్రియురాలి మోజులో.. భార్య హత్య

నిందితుడికి రిమాండ్

బంట్వారం/ధారూరు: ప్రియురాలి మోజులో పడి భార్యను హత్య చేసిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ధారూరు సీఐ రామకృష్ణ, బంట్వారం ఎస్‌ఐ ఆనంద్ వెల్లడించారు. బంట్వారం మండలం వెంకటాపూర్‌కు చెందిన ప్రకాశ్.. గత నెల 25న తన భార్య జగ్గమ్మతో కలిసి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యామని, బైక్ అదుపుతప్పి గుంతలో పడగా జగ్గమ్మ తలకు గాయమై చనిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా.. మృతురాలి బంధువులు భర్తపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరాన్ని ఒప్పుకొన్నాడు. తనకు మరో అమ్మాయితో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయంలో బుగ్గమ్మ తనను నిత్యం వేధించేదని చెప్పాడు. ఎలాగైనా ఆమెను అడ్డు తొలగించుకోవాలనే పథకం వేశాడు. ఉద్దేశపూర్వకంగా బైక్‌ను గుంతలో పడేసి బుగ్గమ్మ తలపై బండరాయితో మోది హత్యచేశాడు. అనంతరం ప్రమాదంగా చిత్రీకరించి.. పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో నేరాన్ని అంగీకరించడంతో కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలి



వికారాబాద్: ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ధారూరు: ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ సోదరి ప్రమీల



మోమిన్‌పేట: పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి

- అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలి
- అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి, కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధి బాల్‌రెడ్డిగూడెం గ్రామానికి చెందిన 20మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆయన సమక్షంలో సీనియర్ నాయకుడు నరోత్తం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా.. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఇందులో హరీశ్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, చెన్నారెడ్డి, నవీన్ రెడ్డి, రాంకృష్ణారెడ్డి, నరేందర్, సురేందర్ ఉన్నారు.

గ్యారంటీలే మహిళలకు లబ్ధి

ధారూరు: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు మహిళలకు లబ్ధి చేకూరుస్తాయని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సోదరి ప్రమీల అన్నారు. ధారూరు మండలం కొండాపూర్‌ఖుర్దులో ఆమె పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, నెలకు రూ.2,500ల నగదు సాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని వెల్లడించారు. కావున చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆమె కోరారు. ధారూరు పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంతయ్య, రాజేందర్‌రెడ్డి, కాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: పార్టీలో చేరిన వారితో రితిక్ రెడ్డి తదితరులు

ఇందిరమ్మ రాజ్యం ఖాయం

అనంతగిరి: తెలంగాణలో మరోసారి ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి అన్నారు. బీటీఎస్ కాలనీ, సింగారపు రాచయ్య కాలనీలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సారి చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, కౌన్సిలర్ చందర్ నాయక్, సీనియర్ నాయకులు రత్నారెడ్డి, రమేష్ కుమార్, ముతహర్ షరీఫ్, రామచంద్రారెడ్డి, మధుకర్, రెడ్యానాయక్, శివానందం, పలువురు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరగాలంటే..

కుల్కచర్ల: పేద ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి రామ్మోహన్ రెడ్డి తనయుడు రితిక్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. కుల్కచర్ల మండలం అల్లాపూర్, ముజాహిద్‌పూర్, కామునిపల్లి గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి, కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ అంజిలయ్య, జిల్లా కార్యదర్శి యాదయ్య, ఘనపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ ఆనందం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య, నాయకులు బాల్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, బాలకృష్ణ, వెంకటయ్య, తిరుపతి, చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.